క్లుప్తంగా

నేడు ఉపాధి పనుల సామాజిక తనిఖీ

కొత్తూరు: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో బుధవారం గతేడాది నుంచి ఈ ఏడాది వరకు మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అరుంధతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి అధికారులు అన్ని గ్రామాల్లో చేపట్టిన పనులను తనిఖీ చేశారన్నారు. నేటి సమావేశంలో జిల్లా అధికారుల వద్ద అధికారులు తనిఖీ చేసిన వివరాలను వెల్లడిస్తారని చెప్పారు. కాగా సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకా

మొయినాబాద్‌రూరల్/శంకర్‌పల్లి: పశువులకు నవంబర్ 14వ తేదీ వరకు గాలికుంటు నివారణ టీకాలు పంపిణీ చేయనున్నట్లు మొయినాబాద్, శంకర్‌పల్లి, మహరాజ్‌పేట్ పశువైద్యాధికారులు దేవీరెడ్డి, మానస రెడ్డి, శ్రావణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాలకు వచ్చే ముందుకు రోజు సమాచారం ఇస్తామని పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సబ్సిడీపై శనగ విత్తనాలు

కొందుర్గు: యాసంగి సీజన్‌లో సాగుచేయడానికి రైతులకు సబ్సిడీపై అందించేందుకు శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జిల్లేడ్ చౌదరిగూడ వ్యవసాయాధికారి రాజేందర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్‌బీఈజీ 47 రకం నంద్యాల శనగ విత్తనాలు క్వింటాలుకు రూ.10 వేలు ఉండగా 40 శాతం సబ్సిడీతో రూ.6 వేలకు అందించనున్నట్లు చెప్పారు. అవసరమైన రైతులు పట్టదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుతో సంబంధిత ఈఓను సంప్రదించాలన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

సీపీఐ రాష్ట్ర నాయకుడు జంగయ్య



మాట్లాడుతున్న జంగయ్య

కొందుర్గు: ప్రభుత్వం ఉచిత హామీలు ఇచ్చి అమలులో విఫలమైందని సీపీఐ రాష్ట్ర నాయకుడు బుద్దుల జంగయ్య అన్నారు. మంగళవారం ఆయన చౌదరిగూడలో విలేకరులతో మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల్లో ఉచిత బస్సు సౌకర్యం కల్పించి మిగిలిన హామీలు పక్కనపెట్టిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు ఇస్తామని మోసం చేసిందని ఆరోపించారు. హామీలు అమలు చేసే వరకు పోరాడుతామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్, సహాయ కార్యదర్శులు బాలరాజు, షబ్బీర్, వీరేశం, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో భవ్యతేజినికి బంగారు పతకం



అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కొందుర్గు: వరంగల్‌లో నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ బాక్సింగ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్ పోటీల్లో కొందుర్గు విద్యార్థిని భవ్యతేజిని సత్తా చాటింది. అండర్-17 విభాగంలో ఆమె బంగారు పతకం సాధించింది. ఈ మేరకు వరంగల్ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆమె అవార్డు అందుకున్నారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు



కొంకుట్ల-తంగడపల్లి రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

చేవెళ్ల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొకుంట్ల-తంగడపల్లి రోడ్డుపై కల్వర్టు పాడవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇదే విషయాన్ని 'సాక్షి' దినపత్రికలో ఈ నెల 13వ తేదీన 'రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా?' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు మంగళవారం మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో సదరు కాంట్రాక్టర్ జేసీబీ సాయంతో కల్వర్టు వద్ద పైపులు సరిచేసి రోడ్డుపై మట్టి పోసి చదువును చేయించారు.

అండర్‌పాస్ వద్ద అవస్థలు



వారం రోజులుగా అండర్‌పాస్ కింద నిలిచిన నీరు

పట్టణంలోని వై జంక్షన్ కూడలి సమీపంలో నిర్మించిన అండర్ పాస్ నిర్వహణ లోపం కారణంగా ప్రమాదాలకు నెలవుగా మారింది. వర్షం కురిసిన సమయంలో కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోకపోవడంతో నీరు నిల్వ ఉంటోంది. వరద కారణంగా మట్టి పేరుకుపోయి బైక్‌లు అదుపు తప్పి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి గుంతలు పూడ్చి పేరుకుపోయిన మట్టి, నీటిని తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

– కొత్తూరు



రోడ్డుపై ఏర్పడిన గుంతలు

నేటికీ రేకుల పాకలోనే..

ఏడేళ్లుగా సొంత భవనానికి నోచుకోని రెడ్డిపల్లి పంచాయతీ

- గతంలో రూ.20 లక్షలు మంజూరు
- పాలకుల అలసత్వంతో నిధులు రద్దు



రేకుల ఇంట్లో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం

మొయినాబాద్‌రూరల్: నూతన పంచాయతీలకు సొంత భవనాలు కరువయ్యాయి. పాలనా సౌలభ్యం కోసం గత ప్రభుత్వం ఏడేళ్ల క్రితం ఆరు నూతన పంచాయతీలను ఏర్పాటు చేసింది. వాటికి సొంత భవనాలు లేక డ్వాక్రా, యువజన సంఘాల భవనాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇరుకు భవనాలు, వర్షాలకు ఇబ్బందులు పడుతూ పాలనా కొనసాగించడం కష్టంగా మారిన తరునంలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నూతన భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. మండల వ్యాప్తంగా ఒక పంచాయతీ భవనం నిర్మించి ప్రారంభించగా మరో గ్రామంలో అర్ధాంతరంగా పనులు నిలిచాయి. మిగిలిన గ్రామపంచాయతీల నిర్మాణాల ఊసే కరువైంది.

ఒకటే భవనం పూర్తి

మండలంలో 21 పంచాయతీలు 14 అనుబంధ గ్రామాలు ఉండేవి. జనాభా ప్రకారం రెడ్డిపల్లి, అప్పోజిగూడ, అప్పారెడ్డిగూడ, ఎత్‌మార్‌పల్లి, మోత్కుపల్లి, ఎల్లగూడలను అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నూనత పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. పంచాయతీ భవన నిర్మాణాలకు ఒక్కో భవనానికి రూ.20లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. అప్పోజిగూడలో భవనం పూర్తయి ప్రారంభించగా.. ఎత్‌మార్‌పల్లిలో స్లాబ్‌లు, గోడలకే పరిమితమైంది. రెడ్డిపల్లిలో పంచాయతీ కార్యకలాపాలకు ఇబ్బందిగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది పాటి వర్షానికే కార్యాలయంలోకి నీరు చేరుతోందని వాపోతున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని భవన నిర్మాణానికి చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



రెడ్డిపల్లి పంచాయతీ ఏర్పాటై ఏడు సంవత్సరాలు అయింది. రేకుల రూమ్‌లో కార్యకలాపాలు సాగుతున్నాయి. గత ప్రభుత్వం రూ.20 లక్షల నిధులు మంజూరు చేసింది. కానీ పంచాయతీ భవనం నిర్మాణానికి నోచుకోలేదు. ఇప్పటికైనా అధికారులు పంచాయతీ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– మామిడి మధుసూదన్‌రెడ్డి, రెడ్డిపల్లి

కాంట్రాక్టర్లు ముందుకు రాక..



రెడ్డిపల్లి పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పిల్లర్లు నిర్మించేందుకు గుంతలు తీశారు. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. దీంతో నిధులు రద్దయ్యాయి. నిధులు మంజూరైతే భవన నిర్మాణానికి కృషి చేస్తాం.

– విజయ్‌కుమార్, డిప్యూటీ డీఈ, పంచాయతీరాజ్

రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం



రిలే దీక్షలు చేస్తున్న బీసీ సంఘం నాయకులు

షాబాద్: బీసీ రిజర్వేషన్ సాధించేంతవరకు ఉద్యమం కొనసాగిస్తామని బీసీ రిజర్వేషన్ల సతిమి సభ్యులు అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం మూడవ రోజుకు చేరుకున్నాయి. నాయిబ్రాహ్మణ, అరెకటిక, మ్యాదరి మహేంద్ర సంఘాలు చేస్తున్న రిలే దీక్షలకు బీసీ సంఘం నాయకులు జడల రాజేందర్‌గౌడ్, చేవెళ్ల స్వామి, రాపోల్ నర్సింలు, వెంకట్‌యాదవ్, రవీందర్, ఒగ్గు రాజు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. పార్టీలకతీతంగా రిజర్వేషన్ల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బీసీ సంఘం నాయకులు చెన్నయ్య, సందీప్, పాండు, సత్యనారాయణ, భిక్షపతి, శేఖర్, వెంకటేశ్, శ్రీనివాస్‌గౌడ్, విజయ్ పాల్గొన్నారు.

మట్టి రోడ్డుకు మరమ్మతులు



గుంతల్లో మట్టి పోయిస్తున్న కాంగ్రెస్ నాయకుడు ఆంజనేయులుగౌడ్

మొయినాబాద్‌రూరల్: గ్రామాల మధ్య రోడ్ల అభివృద్ధితోనే సత్సంబంధాలు బలపడతాయని కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఆంజనేయులు గౌడ్, మాజీ సర్పంచ్ బాలమణి అన్నారు. చిన్నమంగళారం-పొద్దటూరు రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా ఉండడంతో ఆంజనేయులుగౌడ్ సొంత ఖర్చుతో మట్టి పోయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్ రెడ్డి, రాములు, మల్లేశ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

చేవెళ్ల ట్రాఫిక్ సీఐ సతీశ్

మొయినాబాద్ రూరల్: వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని.. పెండింగ్ చలాన్లను వెంటనే చెల్లించాలని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ సతీశ్ అన్నారు. మంగళవారం ఆయన తన సిబ్బందితో కలిసి ఎంపీడీఓ కార్యాలయం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పార్ట్-2 పాఠ్యపుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న సీఆర్‌పీలు

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలలకు పార్ట్-2 పాఠ్యపుస్తకాలు వచ్చాయి. ప్రభుత్వం సరఫరా చేసే పాఠ్యపుస్తకాలు మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రాలకు చేరుకోవడంతో రెండురోజులుగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేస్తున్నారు. మంగళవారం మండల విద్యాధికారి ఎల్.పురన్‌దాస్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కావాల్సిన పార్ట్-2 పాఠ్యపుస్తకాలు 70శాతం వచ్చినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 14 వేలకు పైగా విద్యార్థులు ఉన్నారని చెప్పారు. ఇందులో ఇంగ్లిష్ మీడియం పాఠ్యపుస్తకాలు మొదటి విడతలోనే పంపిణీ చేశామని తెలుగు మీడియానికి సంబంధించిన విద్యార్థులకు మాత్రం తెలుగు, ఇంగ్లిష్ కలిసి ఉండేలా పుస్తకాలు పార్ట్-1, పార్ట్-2 భాగాలుగా ఉన్నాయని వివరించారు. అర్ధవార్షిక పరీక్షల అనంతరం పార్ట్-2 పాఠ్యపుస్తకాల సిలబస్ ప్రారంభమవుతుందన్నారు. ఎంఈఓ కార్యాలయంలో ఉన్న ఈ పాఠ్యపుస్తకాలను సీఆర్‌పీలు కిష్టయ్య, శంకర్, తదితరులు ఉపాధ్యాయులకు అందజేస్తున్నారని చెప్పారు.

మైసిగండిలో ప్రత్యేక పూజలు



మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న రవియాదవ్

ఆమనగల్లు: కడ్తాల మండలం మైసిగండిలోని మైసమ్మ ఆలయంలో మంగళవారం రాష్ట్ర సదర్ ఉత్సవ కమిటీ కార్యదర్శి చీపిరి రవియాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అశోక్‌యాదవ్, ఉపాధ్యక్షుడు రేణుకేశ్‌యాదవ్, షాద్‌నగర్ యూత్ ప్రెసిడెంట్ రవియాదవ్, రెడ్డి సంఘం షాద్‌నగర్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మార్కెట్‌లో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గీత

ఆమనగల్లు: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడానికి పలు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత అన్నారు. మార్కెట్‌యార్డు కార్యాలయంలో మంగళవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన మార్కెట్ కమిటీ సమావేశం జరిగింది. మార్కెట్ యార్డులోని ఓపెన్ ప్లాట్‌లో షెడ్డు నిర్మించాలని, గోదాం మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన చోట సీసీ రోడ్డు నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. అనంతరం యాట గీత మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. త్వరలో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు రమేశ్, నరేశ్‌నాయక్, రవీందర్, జంగయ్య, యాదయ్య, సంపత్‌కుమార్, శ్యాంసుందర్ రెడ్డి, అజీం, శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, అంజయ్య, పాండురంగయ్య, సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారమే ఆరోగ్యానికి మేలు

ఐసీడీఎస్ సీడీపీఓ ఉదయ



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ ఉదయ

నందిగామ: విద్యార్థులు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు పోషకాలు ఉన్న ఆహారపదార్థాలను తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఉదయ సూచించారు. మండల పరిధిలోని చేగూరులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీబాయి ఆధ్వర్యంలో మంగళవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ సీడీపీఓ ఉదయ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు పోషకాలు కల్గిన ఆహార పదార్థాలు, ఆకు కూరలు, తాజా కూరగాయలు, పండ్లు, గుడ్లు తీసుకోవాలని సూచించారు. శిశువుకు తల్లి పాలు అమృతంతో సమానమన్నారు. బాల్యవివాహాలు చేసుకోవద్దని సూచించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం అన్నారు. అనంత విద్యార్థులకు పోషక ఆహారంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గర్భిణీలకు సాముహిక సీమంతాలు నిర్వహించి, ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన చేయించారు.

జిమ్స్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

ముచ్చింతల్ జిమ్స్ ఆస్పత్రి, హోమియో కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎత్తు, బరువు గుర్తించి, ఆరోగ్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు శివలీల, స్వర్ణలత, మంజుల, సంతోష, ప్రేమలత, సుజాత, మాణెమ్మ, ఆశలు, తల్లులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యాసంగి పంటలపై అవగాహన అవసరం

వ్యవసాయ వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు లీలారాణి, మహాదేవప్ప



మాట్లాడుతున్న లీలారాణి

మొయినాబాద్: వాతావరణ మార్పుల ప్రభావం నుంచి పంటలను సంరక్షించుకోవాలని వ్యవసాయ వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు లీలారాణి, మహాదేవప్ప అన్నారు. మొయినాబాద్ రైతు వేదికలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ వాతావరణ విభాగం, భారత వాతావరణ శాఖ(ఐఎండీ) సంయుక్త ఆధ్వర్యంలో యాసంగి, రబీ పంటలపై వాతావరణ ప్రభావం, పాటించాల్సిన మెళకువలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాలు కురిసినప్పుడు పొలాల్లో నీరు నిలువకుండా ఎత్తు మండులు(బోజలు) వేసుకోవాలన్నారు. పూలు, కూరగాయ పంటలు సాగుచేసే రైతులు నర్సరీల్లో నారు పోసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొబైల్‌లో మౌసమ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని స్థానిక వాతావరణ పరిస్థితులను తెలుసుకోవచ్చన్నారు. ఆ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పనులు, పంటలుసాగుచేసుకోవడానికి వీలుంటుందన్నారు. ఉదయం, సాయంత్రం చల్లటి వాతావరణం ఉన్న సమయాల్లోనే పంటలకు పురుగు మందు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాతావరణ శాఖ అధికారి నాగరత్న, చేవెళ్ల ఏడీఏ సురేశ్‌బాబు, మొయినాబాద్ ఏఓ అనురాధ, ఏఈఓలు సునీల్‌కుమార్, కుమార్, వరుణ్, రైతులు పాల్గొన్నారు.

వార్డులో సమస్యలు పరిష్కరించండి

ఆమనగల్లు: మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని మాజీ కౌన్సిలర్ శ్రీశైలంయాదవ్ కోరారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్ శంకర్‌నాయక్‌ను కాలనీవాసులతో కలిసి వినతిపత్రం అందించారు. 11వ వార్డు పరిధిలో వీధి లైట్లు బిగించాలని, సీసీ రోడ్డు, అంతర్గత మురుగు కాలువలు నిర్మించాలని వినతిపత్రంలో కోరారు.

ఆమనగల్లు అభివృద్ధికి సమష్టి కృషి

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి

ఆమనగల్లు: పట్టణాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా సమష్టిగా కృషి చేద్దామని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి సూచించారు. ఆమనగల్లు అభివృద్ధి కోసం ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డిలను కలుద్దామని చెప్పారు. పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో మంగళవారం దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అలయ్‌బలయ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దసరా సంబరాలను విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు, దాతలు, అధికారులను సత్కరించారు. అనంతరం ఆచారి మాట్లాడుతూ.. ఆమనగల్లు అభివృద్ధిని ఎవరూ అడ్డుకోవడం లేదన్నారు. పట్టణాభివృద్ధి కోసం రాజకీయాలు, కులమతాలకు అతీతంగా అందరం కలిసి ముందుకు సాగుదామన్నారు. అభివృద్ధి కోసం అవసరమైతే తాను కూడా ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డిలను కలిసి అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుందామని చెప్పారు. వీలైనంత త్వరలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వివాదం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరిగేలా చూడాలని సూచించారు. ఆమనగల్లు అభివృద్ధికి ఎవరు అడ్డుపడిన సహించేది లేదని హెచ్చరించారు. త్వరలో బొడ్రాయి పండుగ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి



దీక్షలో కూర్చున్న సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య, నాయకులు

సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

ఆమనగల్లు: ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను వెంటనే మార్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. తలకొండపల్లి మండల కేంద్రంలో మంగళవారం సీపీఎం మండల కార్యదర్శి గుమ్మడి కురుమయ్య ఆధ్వర్యంలో రీజనల్ రింగ్‌రోడ్డు భూ నిర్వాసిత రైతులతో కలిసి ఒకరోజు రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. ట్రిపుల్‌ఆర్ నిర్మాణం పేరుతో నిరుపేద రైతుల భూములను లాక్కోవడం అన్యాయమన్నారు. ట్రిపుల్‌ఆర్ మొదటి అలైన్‌మెంట్‌ను మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తరువాత బడాబాబుల భూములను కాపాడుతూ నిరుపేద రైతుల భూములను కోల్పోయేలా అలైన్‌మెంట్‌ను మార్చారని ఆరోపించారు. ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా మొదట ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌ను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్, వెంకటయ్య, చెన్నయ్య, దైవానందం, పోచయ్య, మల్లేశ్, మాజీ సర్పంచ్ వెంకటస్వామి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మయ్య, నిర్వాసిత రైతులు మల్లేశ్, యాదగిరి, నవీన్, మాధవరెడ్డి, యాదయ్య, రాజు, ధర్మారెడ్డి, సుధాకర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ రిలే దీక్షకు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సంఘీభావం తెలిపారు.